కథా నిలయం
శ్రీకాకుళం



# వింత చింత

గోవర్ధన స్వామి ఆలయ దేవస్థానం ఆఫీసర్ రథసారథి రమణవరం గ్రామంలో బస్సు దిగి వాచీ చూసుకున్నాడు. ఉదయం పదిగంటలు. దార్లో రెండు రైల్వే గేట్లు పడుండకపోతే ఎంచక్కా పెందరాడే చేరి ఉండేవాడు.

ఈ రోజు వేలం పాటలున్నాయసలే... పాల్గొనదలచిన వారి కోసం టముకు వేయించమని, రెండు రోజుల క్రితం గుమాస్తాకి చెప్పి, సెలవు పెట్టి వూరొదిలి వెళ్ళాడు.

భజ్రాజమానం గుమాస్తా ఏం చేసాడో ఏమో? తిక్కమనిషి అనవసరంగా ఆలోచనలు పెట్టుకుని, బుర్రపాడు చేసుకోవటమే కాక, తన కొచ్చిన అనుమానాలన్నీ ఇవతలి వారిపై నెట్టేస్తాడు.

బస్సు దుమ్ము రేపుకుంటూ వెళ్ళిపోయిన దాకా రోడ్డు దాటలేదు రథసారథి. అక్కడికి నాలుగడుగుల దూరంలో నూతనంగా వెలసిన దేవస్థానం ఆఫీసులోకి వెళ్లేసరికి హవల్దార్ రంగాచార్యులు నమస్కారం పెట్టి ప్రక్కకి తప్పుకున్నాడు. గుమాస్తా భజరంగ్ కుర్చీలోంచి లేచి నిల్చున్నాడు వినమ్రంగా...

కుర్చీలో చతికిల పడ్డ రథసారథికి చల్లని మంచినీళ్ళు అందించాడు నౌకరు నరసింహం. గడగడ తాగేసి భజరంగ్‌ని రమ్మన్నట్లు కళ్ళతో సైగ చేశాడు.

"అయ్యా! ఈ రోజు చేసిన ప్రసాదంలో లడ్డూ తప్ప చక్కెరపొంగళి, పులిహోర, దధ్యోజనం, పూర్తిగా అమ్ముడయ్యాయి. ఇంకా యాత్ర పుంజుకుంటుంది. మరి కొంచెం చేయించాలా వద్దా.... ఈ భోగట్టా కోసం నాలుగైదు సార్లు వంటాచారి వెంగమాంబా చార్యులు వచ్చి వెళ్ళాడు." చేతులు కట్టుకుని చెప్పాడు భజరంగ్.

"యాత్ర తొక్కిసలాటను బట్టి అమ్మకాలుంటాయని ఎరగడా! దీనికి నా గురించి ఎదురుచూసి టైమ్ వేస్టు చేయటమెందుకూ! స్టోర్రూం ఇన్‌ఛార్జి ఎవరసలు.." విసుగ్గా ప్రశ్నించాడు.

అసలు శ్రీ రంగయ్య స్టోర్రూం చూస్తాడు. ఇటీవల రిటైర్ అయిపోయినందువల్ల – ఆ పోస్టింకా భర్తీ కాక ఇన్‌ఛార్జిగా గిరిజారావు ఉన్నాడు.

అదే విషయం భజరంగ్ చెప్పాడు. వెంటనే గిరిజారావుకి పిలుపు వెళ్ళింది.

"ఏమయ్యా స్టోర్రూంలో సంభారాలు తీసి వంటాచారికి ఇవ్వాలని తెలీదా!యాత్ర అంచనా అతనికి తెలీకపోతే నీకు తెలీదా? వెంటనే ఇచ్చి తగలడు." వచ్చిన గిరిజారావును చెప్పుల్లోనే కాళ్లుంచి తోలేశాడు.

"అయ్యా!, ఈ రోజు టపాల్స్..." భజరంగ్ టేబుల్‌మీద పెట్టిన కవర్ల వంక చూశాడు రథసారథి.

అందమైన తెలుగు టైపులో పొదిగిన అక్షరాల మూకలలో భావాలు జీర్ణమయ్యేసరికి రథసారథి మొహం 'విచికిత్స' అనే కవళికను ప్రకటించుకుంది.

ఆ కవరు హెడ్డాఫీసు రాజరాజేశ్వరి దేవస్థానం నుండి వచ్చింది. ఆర్థికంగా ముందంజవేసిన ప్రాచీన దేవాలయమది. ఇటీవలి కాలంలో ప్రాచీన దేవాలయాల పునరుద్ధరణ చేపట్టి – అందులో భాగంగానే అయిదు దేవాలయాలను దత్తత చేసుకున్నది. ఈ పరిధిలోనిదే గోవర్ధనస్వామి దేవాలయం. ఈ ఆరు నెలల కాలంలోనే ఎన్నో అభివృద్ధి ప్రణాళికలను చేపట్టింది. దాని ఆదాయాలు కూడా దాని ఆలయశిఖరాల్లా పెరిగాయి.

తమ అధికారి వదనంలో ప్రోగవుతున్న సందేహాల సమూహానికి తనే సమాధానం ఇవ్వాల్సి వస్తుందోనన్న బెంగభావం భజరంగ్ మొహంలో చోటుచేసుకున్నది.

"అయినా మతి – సుతి లేదా" విప్పిన కాగితాన్ని అట్లానే టేబుల్‌పై విసిరి కొట్టి వెనక్కి వాలాడు రథసారథి.

"అయ్యా! నేను..." అన్నది తననేమోనని పుక్కిట పట్టిన మనిషి మాట్లాడలేని చందంగా ఏదో సగం నాన్పుడుతో అదోలా అయిపోయాడు భజరంగ్.

"నీకూ–నాకూ కాదు. మతి సరిగా లేనిది హెడ్డాఫీసు వాళ్లకి. వాళ్ళిచ్చిన నోటీసు చూస్తుంటే అగమ్యంగా ఉంది. చదివి చూడు తెలుస్తుంది"

నేరం తనది కానందుకు సంతోషించి టేబుల్ మీద కాగితాన్ని నిండు వూపిరితో తీసుకున్నాడు భజరంగ్.

"శ్రీ దేవస్థానం ఆఫీసరు వారి దివ్య సముఖమునకు... ఇరవై ఆరవ తేదీన పంపిన అత్యవసర వర్తమానం చేరింది. విషయం తెలుసుకుని విచారించినాము. తమ వర్తమానంలోని విషయం అతి జరూరుగా భావించి దానికి తగిన పరిష్కారంను తమరు సూచించినట్లుగానే ఆమోదయోగ్యము.

తమకార్యాలయమును అనుకుని ఉన్న చింత చెట్టు ఎండిపోయినదనిన్నూ, ఈదురు గాలుల ప్రభావం విపరీతంగా ఉన్నందువల్ల ఏ క్షణాన్నయినా కూలి ప్రమాదం సంభవించే అవకాశమున్నదనీనూ, తలచిన తమరు దానిని వెంటనే వేలంవేసి నరికించవలసిందిగా ప్రధాన కార్యనిర్వాహణాధికారి వారి ఉత్తర్వు... ఇది అతి జరూరుగా భావించవలెను."

ఇట్లు

రాజరాజేశ్వరి దేవస్థానం, గుడిమెట్ల

"మీరన్నట్లుగానే మతిలేనిది వారికేనండీ! అసలు మనం చింతచెట్టు ఉందనీ, అదెండిపోయిందని, అది మన కద్దనీ వ్రాసి తగలడ్డామా ఏమిటి?"

"ఏమిటో ఈ అయోమయం భోగట్టా" కవరు మడిచి ఇచ్చేసాడు భజరంగ్. మీమాంసలో పడ్డాడు రథసారథి. పొరపాటున గాని ఈ తిక్క సన్నాసి ఏదో ఆలోచనల్లో పేపరు కెక్కించిపడెయ్యలేదు కదా! వ్రాసి ఉండనట్టయితే ఉత్తర్వులు తమకు ఎందుకు జారీ చేస్తారు? ఇదేం ముసాఫిర్ బంగళా కాదు. ఒక బాధ్యతెరిగిన సంస్థ. అన్ని సంస్థల దారి వేరు. ఈ సంస్థ దారి వేరు. ప్రతిదానికి ఎదురుగుండా ఉండే దేవుడి జడుపు ఒహటుంటుంది.

ఎందుకయినా మంచిదని రికార్డు తిరగేసి హెడ్డాఫీసుకి ఏ రోజు ఏయే టపాల్స్ పంపినదీ చూశాడు. దొరకలేదు. విసుగొచ్చింది. పుస్తకం మూశాడు.

అసలే ఈ రోజు పనులన్నీ మందకొడిగా సాగుతున్నాయి. వేలాల వాళ్ళు గబ్బిలాల్లా పట్టుకువ్రేలాడతారు. ఒకంతట తెగ్గొట్టరు. అర్ధరాత్రి – అపరాత్రిగ్గాని తేలేసంగతి కాదు. వాళ్ళలో వాళ్ళు కొట్టుకు చావటమే కాక తమను చంపుతారు.

ఇటువంటి స్థితిలో అర్ధంకాని ఈ 'చింత' ఒకటి? "కోనేరు కాపలాదారు చవలయ్యని వెళ్ళి ఆలయం పరిసరప్రాంతంలో ఏయే చెట్లున్నాయో చూసి రమ్మనండి" భజరంగ్‌కి చెప్పాడు రథసారధి.

ఆ కబురు చవలయ్యకి చేరింది. వాడు బయలుదేరి చెట్లవేటలో పడ్డాడు.

ఏదో మాట్లాడాలని ఎంతో సేపయి నిలుపుజీతం తీసుకుంటున్న హవల్దార్ రంగాచార్యులు మడిబట్టలను ఒకరికి తగలనీ కుండా ఒద్దికగా పట్టుకుని ముందుకు వచ్చాడు.

"అయ్యా! వచ్చే శుద్ధ ఏకాదశినాడు మా నాయనగారి ఆబ్దికం శ్రీకూర్మంలో ఉన్నది. దయఉంచి తమరు నాకు అనుమతి ఇప్పిస్తే సెలవు పెట్టుకుంటాను." ఏడాది కోసారి అపరకర్మలకో, శుభకార్యాలకో తప్ప సెలవడగని హవల్దార్‌కి సైతం అనుమతించడానికి సందేహించే రథసారథి మనస్తత్వం ఎవరికీ నచ్చదు.

"ధూపం, దీపం ఎవరు చూస్తారండీ!" అపుడే అడ్డుపుల్ల వేయడం మొదలు....

"మా మేనల్లుడు వరాహం చూస్తాడండీ!" కాస్త నోటికి ముక్కొచ్చిన మనిషి మీద పెట్టివెళితే నాకూ బెంగుండదు... సరే నాండి.." అర్థింపుగా చూశాడు హవల్దార్.

"ఆ సర్సరే... చూడండి.. వరాహాన్ని ఈ రెండోజులూ తైనాతూ కనిపెట్టుకుని ఉండమనండి. అసలే రద్దీ రోజులు.." చెప్పేసరికి రంగాచార్యులు వెనుదిరిగాడు.

ఏదో టూరిస్టు వచ్చినట్లుంది. బిలబిల దిగే జనాన్ని తమ బంధుజనం కంటే అతి మిన్నగా చూసుకునేందుకు సిద్ధంగా ఉన్న వ్యాపారులు వద్దన్నా వినకుండా వారి వారి చేతిలోని బ్యాగుల్ని అతి లాఘవంగా చోరుల్ని మరపించి మరీ తమ చేతుల్లో 'లాకప్' చేసి తమ వెంట తీసుకుపోతున్నారు.

కాపరి వెంట వెళ్లే గొర్రెల్లా తలొంచుకు పోతున్నారు వాళ్లు. కొందరు బేరాల కోసం యాత్రికుల్ని అటొక రెక్క - యిటొక రెక్క లాగుతున్నారు.

బయటకొచ్చి చూశాడు రథసారథి. ఆయన్ను చూసి కొద్దిగా చలించారు వ్యాపారులు. ఎవరి దుకాణాల్లోకి వారు దూరారు. ఒకసారి ఆలయ ప్రాంగణంలోకి పాదం మోపాడు.

"సార్! గోపరాజుకీ, మన చిన్న అర్చకులవారికీ రగడ మొదలైంది" కొద్దిగా వంగి, వినయం ప్రదర్శిస్తూ చెప్పి తప్పుకున్నాడు సింహద్వారం దగ్గర వాచర్ సూరిబాబు.

ఈ మధ్యనే హెడ్డాఫీసు వాళ్లు కొందరిని ఎన్.ఎం.ఆర్‌లు గా వేశారు.

అందులోవాడే గోపరాజు. జీతం తక్కువే అయినప్పటికీ బాధ్యత మాత్రం పెద్దమొత్తంలో నెత్తినపెట్టారు. అది వారికి రాళ్ల మూటయ్యింది.

లోగడ ఆలయం దత్తత కాని రోజుల్లో వచ్చిన ప్రతీ భక్తుడి చేత గుంజి మరీ జేబుల్లో డబ్బులు ప్లేటులోకి రప్పించి మరీ దోపిడీ చేసే అర్చక మహాశయులకి దేవాలయ ఆదాయాలతోపాటు వారి జీతాలు ఎవరెస్టు శిఖరాల్లా చేసినా సరే పాత చేతివాటుతనం 'యింకక' యింకా తీరని గుల గుల చూస్తూ వూరుకోలేని ఎన్.ఎం.ఆర్.ల ఉడుకురక్తం దైవభక్తుల కానుకలు, దక్షిణలు హుండీకే పరిమితం చేస్తున్నప్పుడు వారి మధ్య అగ్గి రగులుకోడమూ – అది అధికారి నోటీసుకి వెళ్లటమూ జరిగిపోతూంది.

లోనికి వచ్చిన రథసారథి బయట నిలుచుని గర్భగుడి వంక చూడసాగాడు.

అర్చకుడు తన కోపోద్రిక్తత – మూలవిరాట్టుపై విసిరే పుష్పాల జల్లులో కనిపిస్తోంది. గోపరాజు మొహం వెల వెలబోయి వున్నది.

యాత్రికుల కిటకిట తగ్గినాక బయటకొచ్చాడు అర్చకుడు. "ఎందుకంటే ఆచారి గారూ! మనిషికి కొంత తృప్తి ఉండాలి. కొత్తవాడ్ని అతన్నెందుకు ఆడిపోసుకుంటారు. అతని డ్యూటీ అతనిది" ఛీత్కారంగా చూశాడు రథసారథి.

తలొంచుకున్నాడు అర్చకుడు.

గోపరాజు మొహం ఎత్తడానికి మందలింపు సాయం చేసింది.

ఒకసారి ప్రదక్షిణ చేసుకొని బయటపడ్డాడు రథసారథి. బయట చవలయ్య సిద్ధం.

"అయ్యా! తవరు సెప్పినట్టుగా ఓ రౌండు కొట్టుకొచ్చిన... తొగర, యిరిడిసేవ, మావిడి, మద్ది సెట్లున్నాయి. సింతోటి వుంది గాని" నసిగాడు.

"కాని," "ఎండిపోనేదు బాబూ! పచ్చగా కలకల్లాడిపోతున్నాది. ఎండిపోయిన్సెట్టింకోటున్నాది బాబూ! కాని..."

"మళ్లీ కాని ఏట్రా! చెప్పు"

"అది సింత కాదయ్యా! పెదబొడ్డసెట్టు..."

"సర్సరే...నువ్వెళ్లు..." అంతకంటే అధిక ప్రసంగం – క్రిందివారితో చేయటం నచ్చని రథసారథి ముందుకి కదిలాడు.

"అయ్యా! వేలాల వాళ్లు మరో గడియలో వాలేట్టున్నారు. ఇంక చింత విషయమే మిగిలింది." భజరంగ్‌కి సైతం బెంగగానే వున్నది.

"ఈ చింత విషయం చిన్న విషయమేం కాదు. ఏదో ఒకటి చేసేయాలి. ఓ ఎండిన చెట్టేదో చవలయ్య కళ్లపడ్డదిట. కాని అది పెదబొడ్డట. చింత ఉంది కాని... కాపు కాస్తున్నది."

"అబ్బెబ్బే చాలా పాపం సార్! పచ్చని చెట్లని పొట్టన పెట్టుకుంటే ఆ పాపం పదికాలాల పాటు వెంటాడి పచ్చని కాపురాలు కూలుస్తుందని ఎక్కడో చదివాను." భజరంగ్ పాపభీతి – రథసారథిలో కూడా చొచ్చుకుపోయింది.

ఇద్దరూ గుంజాటన పడ్డారు.

"ఆ అయిడియా! అడవిలో ఎండిన చెట్టు ఎలాగూ వున్నది కదా!"

"అది పెదబొడ్డ చెట్టు కదా!" – రథసారథి భయం

"ఎవరు చూడొచ్చారు... మనం చెట్టు పాళంగా వేలం వేయం కదా! పేళ్ళు కొట్టించి వంట చెరుకుగా వేలం వేద్దాం"

"ఎవరూ పసిగట్టరు కద!" ఏదో అనిశ్చింత–

"ఇప్పటికి గట్టెక్కాలంటే! టౌను వారికి వేలం గురించి కబురెడితే పట్టుకుపోయి మార్కెట్లో మన పులిహోర పాకెట్ల కంటే అర్జెంటుగా అమ్మి సొమ్ము చేస్కుంటారు". భజరంగ్ అభయం రథసారథిలో ప్రాణవాయువు నింపింది.

అలా చేయాలనే అనుకున్నాడు.

ఆ సాయంత్రం దుకాణాల వేలం, కొబ్బరి చిప్పలు, పుట్టుకొప్పులు, చెప్పులు భద్రపరచే దుకాణం ఇతర దుకాణాలు, కుంకుళ్ళు, మామిడి చెట్ల వేలాలు నిర్వహించటానికి సమాయత్తమైనాడు.

అంతా పూర్తయ్యేసరికి అర్ధరాత్రి పన్నెండు దాటింది....ఆలస్యం వల్ల మత్తుగా నిద్ర పట్టేసింది.

★★★

"సుండల (తాలింపు పెట్టిన కొమ్ముసెనగలు) భోగానికి సంబారాలు నిండుకున్నాయి. తెప్పిస్తారా! "వెంకోబాచార్యులు అధికారిని కలిసి అడిగాడు.

"అదేంటి మొన్న పర్చేజ్‌లో తెచ్చుకున్న వన్నీ అయిపోయాయా!

"ప్రస్తుతానికి పచారి కొట్టు మీంచి తెప్పించండి." అని స్టోర్రూం ఇన్‌చార్జివంక చూసాడు.

వాళ్లు వెళ్ళిపోయాక రథసారథి తనపనిలో నిమగ్నమైనాడు. ఆ సాయంత్రమే.

వేలం వ్యవహారం ఓకొలిక్కి వచ్చింది. నగరం మార్కెట్ నుండి వంట చెరకు పాటకొచ్చారు. ఓ వెయ్యి రూపాయల దాకా పాట వెళ్ళింది.

డబ్బు కట్టేసి వేన్‌లో పట్టుకుపోయారు.

మర్నాడు టపాల్స్‌లో – రాజరాజేశ్వరీ దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రెండు రోజుల్లో వస్తున్నట్లు కబురు.

రథసారథికి ఎందుకో భోగట్టా తెలిసాక చిన్న జడుపు పట్టుకున్నది. నరాలన్నీ పీకినట్టయింది. వచ్చిన ఆదేశం మీద తనేదో దబాయించి చింత చెట్టని చెప్పి ఏదో చెట్టుకొట్టేసాడేకాని... అసలు విషయం ఎపుడయినా పొక్కదుకదా!

అనుకున్నట్లుగానే ఇ.వో. కూర్మావతారం దిగబడ్డాడు. అతనితో వచ్చి హెడ్డాఫీసు సూపర్నెంటు అరవిందరావు ఆలయ ఆదాయ వ్యయాలు, రికార్డులు, రిజిస్టర్స్ అన్ని ముందేసుకుని ఈకకి ఈక తోకకి తోక పీకివదిలాడు. కూర్మావతారం మాత్రం ఆలయ అభివృద్ధి పనులు చేపట్టడానికి స్థల విస్తీర్ణం ఏమాత్రం ఉన్నదో చూడ్డానికి ఆరుబయటకు వచ్చాడు.

అతను వచ్చేసరికి అరవిందరావు... "అయ్యా! చిన్న తిరకాసు వ్యవహారం రథసారథిగారి హయాంలో జరిగిపోయింది. చింత చెట్టువేలం వేయమని 'హెడ్డాఫీసు వారి ఎమర్జెంట్ ఉత్తర్వులు మేరని' వ్రాసారేమిటి?

"రథసారథిగారూ! ఏవిటీ, మేం మీకు చింతచెట్టు కొట్టించి వేలం వేయమని ఆర్డరివ్వలేదే! మీరేవిటిలా!" అర్థం కానట్లుగా అడిగాడు.

"అదేంటి మీ ఆఫీసు నుండి పంపాకే కదా! నే ఫాలో అయ్యిందీ! విడ్డూరంగా ఉందే? కావలిస్తే చూపిస్తానుండండీ." వారం క్రితం వచ్చిన కాగితాన్ని ఇ.వో. గార్కి చూపించాడు రథసారథి

కూర్మావతారం ఆ కాగితాన్ని పదేపదే వింతగా పరికించి చూస్తే – "ఎస్! ఇది మన డిస్పాచ్ క్లర్క్ శతావధానరావు నిర్వాకమే. వెధవ... గోపవరం దేవస్థానం వారికి వెళ్ళవలసిన కాగితాన్ని ఈ అడ్రసుకి పంపాడు. మొద్దుమనుషులు.. తగలెడుతున్నారు ఆఫీసుని..

"అయినా నీకు బుద్దుండక్కర్లేదయ్యా! మేం పొరపాటున పోస్టు చేసామే అనుకో... నువ్వు ముందు వెనకలాలోచించకుండా ఏదో ఒకటి చేసెయ్యడమేనా! ఎక్కడి చెట్టు కొట్టించేసి వేలం వేసావు!" ప్రశాంత గోదావరిలా అంతదాకా నిమ్మళంగా ఉన్న ఇ.వో.

బాబు గంగానమ్మలా వెర్రెత్తి పోయాడు.

రథసారథి గుండెలో రైళ్ళసడి మొదలైంది. ఎంత తెలివి తక్కువ పని చేసాడు తను. చెప్పుకోలేని సిగ్గుచేటు అవకతవక వ్యవహారం తన నెత్తిన రుద్దబడింది.

భజరంగ్ తన వ్యక్తిత్వం ఈ విషయంలోనూ పోనిచ్చుకున్నాడు కాదు.

"అది కాద్సార్! తమరి ఆర్డర్ ప్రకారం జరపాలని అలా చేసాను. ఏదో తెలివి తక్కువే అయింది.. క్షమించాలి.." వేడుకున్నాడు...

"అయినా నీ నడవడి... సంతృప్తికరంగా లేదు" అంటూ లేచాడు కూర్మావతారం.

ఆ వెంటే సూపర్నెంటు కూడా లేచి నిలుచున్నాడు.

ఇద్దరు కారులో ఎక్కారు. గోపవరం వైపు కారు దూసుకు పోయింది.

★★★

అల్లంత దూరం నుండి వస్తున్న కారును చూసి ఎదురు వెళ్ళి నమస్కారబాణం సంధించడానికి సిద్ధంగా నిలబడ్డాడు త్రిభువనరావు.

అతని నమస్కారం పట్టించుకోకుండా నేరుగా ఆఫీసులోకి దూరాడు కూర్మావతారం. ఆయన్ని అనుసరించాడు త్రిభువనరావు.

ఆలయానికి సంబంధించిన అన్ని విషయాలు సమగ్రంగా చర్చించారు.

తరువాత సూపర్నెంటు అరవిందరావు – 'అయ్యా! ఇ.వొ. గారూ! చింత విషయం!" సన్నగా చెప్పాడు.

"అన్నట్లు త్రిభువనరావు! నువ్వా మధ్యన ఆలయానికి ఆనుకుని ఏదో చింత చెట్టు ఉందని, దాన్ని కొట్టించకపోతే మీదపడే ప్రమాదముంది, వేలం వేసి కొట్టిస్తానని వ్రాసావు కదూ! అయినా అలాంటి అర్జెంట్ కేసుల క్కూడా హెడ్డాఫీసు మీద ఆధారపడాలా! స్వంత ఆలోచనుండొద్దూ! మా ఆర్డర్ జారీ చేసేలోగా ఆ చెట్టెవరి మీదైనా పడి ప్రమాదం జరిగితే..." నొచ్చుకున్నాడు. కూర్మావతారం.

"పోనీలెండి సార్! ఇప్పటికయినా సరే మించిపోయిందేమిటి! కొట్టించేయండి" అరవిందరావు కల్పించుకున్నాడు.

"సార్! నాదోమాట..."చిన్నగా నసిగాడు త్రిభువనరావు.

ఆ మాట వినిపించుకోకుండా.."ఏమయ్యా! ఆ ఎండిన చింత చెట్టేదో ఓ సారి చూపించు.." హఠాత్తుగా కూర్చీ లోంచి లేచాడు కూర్మావతారం.

"సార్ నా మాట కాస్త..."

"తరువాత చెబుదూగాని లేవయ్యా! ఎందుకాదుర్దా!.. ఇంకా ఉంటారుగా.." 'వెనక్కి తగ్గ మన్నట్లుగా సౌంజ్ఞచేస్తూ చెప్పాడు అరవిందరావు.

కూర్మావతారం చూపుడు వేలుతో చూపిస్తూ "అదేనా చింత" అడిగాడు.

"కాని..."

"కాని ఏంటయ్యా!" గట్టిగా అన్నాడు కూర్మావతారం.

"అయ్యా! ఇ.వో.గారూ! ఆ చిటారుకొమ్మన చూడండి... పచ్చగా చిగుళ్లు కనిపిస్తున్నాయేమిటి!" అరవిందరావు అనుమానం.

"ఔనయ్యా! నిజంగానే... పచ్చగా వున్న చెట్టును చూసి, "ఛ.. ఛ.." ఏమిటయ్యా! నీకేమైనా కళ్లు గ్రుడ్డా.." వుద్రేకపడ్డాడు కూర్మావతారం.

"సార్! నా మాట వినలేదు మీరు... ఇందాకట్నించి చెబుదామని ట్రై చేస్తున్నా. మొదట అంటే నెల క్రితమన్నమాట. చండ ప్రచండమైన ఎండలకి చెట్టెండిపోయినట్టయ్యింది. తమరి అనుమతి కోసం వ్రాసాను. నా కాగితం తమరికి అందిందో లేదో తెలీదు... కాని ఈ మధ్య వానలకి.. ఏదో మూల పచ్చి మిగిలి వుందేమో తెలీదు. చెట్టు ఈ మధ్యే చిగురు పెడుతోంది. అంతా అయోమయమైపోయింది సార్!" మొరపెట్టుకున్నాడు.

"చాల్లేవయ్యా! అంతా నీ మూలంగానే తిరకాసయ్యింది. నువ్వీ విషయమే ప్రస్తావించకపోతే యిన్ని రాద్ధాంతాలు జరిగేవి కావు. నిన్ను... మాటల్లో ఎందుకులే!" చాలా వుద్రిక్తంగా కారెక్కాడు కూర్మావతారం.

అరవిందరావు యాంత్రికంగా కూచున్నాడు. దుమ్ము రేపుకుంటూ వెళ్ళిన కారు వంక అదోలా చూస్తూ ఉండిపోయాడు. త్రిభువనరావు.

★★★

ఆఫీసు చేరగానే కూర్మావతారం అందుకున్న మొదటి పిర్యాదు మార్కెట్ వారి నుండి. "మేం విజయనగరం మార్కెట్ మనుషులం! రమణవరంలో దేవస్థానం వాళ్లు వేసిన వంట చెరకు వేలంలో పాడాం. చింత చెట్టు పేళ్ళని చెప్పి పట్టుకుపోయాం. తీరా అమ్మే సమయానికి చింత పేళ్లు కాదని తెలిసింది. పవిత్రమైన దేవాలయంవారే యిటువంటి అవినీతికి ఒడిగడితే ఎలాగండీ! దయచేసి వెంటనే తగిన చర్య తీసుకుంటారని ఆశిస్తున్నాం..." అన్నారు. వాళ్లనెలాగో సర్ది చెప్పి పంపేశాడు కూర్మావతారం.

వెంటనే అతని చేయి అందుకున్న కలం కంగారు కంగారుగా కదిలింది.

ఆ అక్షరాలకు రూపకల్పన చేశాడు పి.ఏ. మూడు కాగితాలు మూడు కవర్లలోకి మారి ఎర్ర డబ్బాలోకి దూరాయి.

ఆ కాగితాల బాసల అర్థాలు యిలా వున్నై. ఎండిన చెట్టని చెప్పి పచ్చని చెట్టుకే ఎసరు పెట్టాలని చూసిన త్రిభువనరావునీ..

తమ ఆలయాన్ని ఆనుకొని చింత చెట్టంటూ లేకపోయినా ఏదో చెట్టు ఎక్కడో కొట్టి యిటు హెడ్డాఫీసు వార్నీ, అటు మార్కెట్టువారిని మోసగించిన రథసారథిని..

ముఖ్యమైన కాగితాన్ని పంపవలసినవారికి పంపకుండా వేరొక అడ్రసుకి పంపి ఇంత అవకతవకకూ కారణభూతుడైన డిస్పాచ్ క్లర్క్ శతావధానరావునూ...

సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వులు!

మొత్తానికి ఆ ముగ్గురిపాలిట అది 'వింత చింతే' అయికూర్చుంది.

(ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక 11-3-1992)